**బతుకమ్మ పండుగ ముందు రోజులలో ఒకనాడు నేను స్కూల్ నుంచి ఇంటికి వస్తుండగా రామన్నపల్లెలో ఒక రైతక్క నా బండి ఎక్కింది. ఒక వర్క్ బ్లౌజ్ కుట్టించుకోవాలని, తెలిసిన టైలర్ ఉంటే చెప్పమని బతిమాలింది. రెండు మూడు చోట్లు తిరిగి చివరికి ఒక టైలర్‌ని ఒప్పించాను. తీరా పండుగ తర్వాత తెలిసిందేమిటంటే ఆమె బ్లౌజ్ తీసుకపోనేలేదట. ఆమెను కలిసి కారణం అడిగినప్పుడు చెప్పిన వలపోతనే ఈ కథ.**

పెద్దింటి అశోక్‌కుమార్

# 3 గుండెలో వాన

బీర శ్రీనివాస్





“రేపేరా... నువ్వు యాడాదికేరా. ఇక్కడేం పడిపోతలేదు,” కోపంగా అంటూ కట్ జేసి సెల్‌ఫోన్ పక్కన పెడుతుంటే జ్యోతి యాదికచ్చింది. పాణం జల్లుమంది.

‘అయ్యల్ల... ఎంత పనాయె... ఇప్పుడెట్ల,’ అనుకున్న.

ఆనాడు మా టేలర్‌కు వచ్చినప్పుడు తప్ప ఆమెను ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు.

తను మాత్రం ఆరోజు కలుపుగోలుగా నవ్వుతూ, “అదేందన్నా. కొత్తగ చూస్తున్నవు. మాది ఎముడాల గాదా. తిప్పారం గడ్డకే వుంటం. మీ సిరిసిల్ల మార్కెట్లనే కొత్తిమీరు కట్టలమ్ముత. నువ్వు ఎన్నిసార్లు కొనుక్కపోలేదు. కొనేది రెండు కట్టలుగని కొసిరేది నాలుగు కట్టలు,” అన్నది.

నాకు ఆమెను చూసినట్టు యాదికి రాలేదు. “అవునా?” అని తలూపి పరిశీలనగా చూసిన.

చామనఛాయ. గుండ్రటి మొహం. మిలమిల మెరిసే కండ్లు. కొంత బోలతనం... కొంత మొండితనం... ముక్కుమీదనే రేషం. పాతి కేళ్లకు మించి వుండదు. బక్క పలుచగా అయినా నిండుగా వుంది.

ఆరోజు ఎంగిలిపూల బతుకమ్మ. ఇమిటేషన్ పట్టుచీర, మ్యాచింగ్ జాకెట్ పీస్‌తో మా టేలర్‌కు వచ్చింది. జాకెట్‌కు మగ్గం వర్క్ చేసి డబ్బ గల్ల పెట్టి అక్కడక్కడ చిన్న అద్దాలు కుట్టమంది. చీరకు మాత్రం కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ వర్క్ చేసి పెద్ద అద్దాలు, అంచులకు చెమ్కీలు, చందన ఫాల్ కుట్టుమంది.

గిరాకి పెద్దదే. వట్టినాడైతే కండ్లు మూసుకుని తీసుకుందుంటి. ఇప్పుడు బతుకమ్మ పండుగ సీజన్. మొసమర్రని కుట్టుడు. అందుకే ఎప్పుడు కావాలని అడిగిన.

ఆమె మెరుస్తున్న కళ్లతో నా దిక్కు చూస్తూ, “ఎప్పుడో అయితే ఇప్పుడెందుకత్తన్నా. సద్దుల బతుకమ్మనాడే కావాలె,” అన్నది.

నాకు కోపమచ్చింది. ‘ఆ... ఇంకా నయం. రేపే కావాలంట లెవ్వు. అందరు పండుగు రేపు మాపనంగనే వత్తరు. మంచి మంచి డిజైన్లు కావాలంటరు. ఎట్లయితయి,’ అనుకుంటూ ఆమెతో మాత్రం, “పండుగునాడయితే అందయి మరి. ఎక్కడన్న కుట్టిచ్చుకో,” అన్న.

ఆమె మొకం పాలిపోయింది. ఏడుస్తదా? అన్నంత బాధగా చూస్తూ, ''నువ్వు తప్ప ఈ వూర్లె నాకెవ్వలు తెలువదన్న. సద్దుల బతుకమ్మనాడు పోతవోసిన బట్టలు కట్టుకోవాలని ఎన్నేండ్ల నుంచో అనుకుంటున్న. ఎప్పటికప్పుడు ఏదో పనివడి దాసుకున్న పైసలు తాకట్లకే వోతున్నయి. అట్లగాదని ఈసారి సేటు దగ్గరనే దాసుకున్న. ఆయిన తింపుకొని తింపుకొని ఇయ్యల్ల ఇచ్చిండు. నువ్వు కాదన్నవనుకో, ఇవి కరంటు మోటరుకే పోతయి. మల్ల నా జీవితంల ఇంత మోఖ రాదు,'' అన్నది.

కానేకాదని ఖచ్చితంగా చెప్పబోతూ ఆమె దిక్కుజూసిన. ఎంతో నమ్మకంతో వచ్చినట్టుంది. నా దిక్కు బతిమిలాడుతున్నట్టు చూసింది. నాకు బాధగా అనిపించింది.

కొద్దిసేపు ఆలోచించి, ''సద్దుల బతుకమ్మ రేపనంగ పొదుగూకే జాముల ఇస్త. అంతకు అద్దగంట ముందన్నా అస్సలు కుదురదు మరి,'' అన్న.

అదే మహాభాగ్యమన్నట్టు నవ్వి, ''సరే అన్నా. ఆనాడు ఎట్లయినా మార్కెట్‌కు వత్తగదా. పొదుగూకి పోయేటప్పుడు తీసుకపోత,'' అన్నది.

బిల్ బుక్ తీస్తూ పేరు అడిగిన.

''జ్యోతి,'' అని చెప్పింది.

''మా చెల్లె పేరే. ఎముడాలకే ఇచ్చినం,'' అంటూ డిజైన్ల బుక్ ముందేసిన. సెలక్ట్ చేసుకుంది. మొండిఘటమే. చిన్నచిన్న మార్పులు చెప్పినా ఒప్పుకోలేదు. కొందరు అంతే ముందుగాల్ల చెప్పితే ఒప్పుకోరు. కుట్టినంక కలర్ మ్యాచ్ కాలేదని, చీరకు తగ్గట్టే లేదని గల్ల పెద్దగయిందని లేని లేని వంకలు వెట్టి బట్టలు మీదేసి పోతరు. అదే ముచ్చట ఆమెతోని చెప్పిన.

'రెండు మాటలుండయన్నా. నాది ఒక్కటే మాట. గిది గుర్రం గది మైదాన్,'' ఖరాకండిగా చెప్పింది.

''మరి పైసలు ఎక్కువయితయి,'' ఓ మాట తలిగేసిన.

''ఎంత?' ఎంతయినా పరువాలేదన్నట్టే అడిగింది.

లెక్కజేసి ఎందుకయినా మంచిదని కొంత ఎక్కువనే కలిపి, ''మూడు వెయిలు,'' అన్న. బ్యారమాడితే కొంత దిగచ్చని.

ఆమె బ్యారమాడలేదు. ఆరు వందలు ఇస్తూ, ''మిగితాయి తీసుకపోంగ ఇస్త,'' అన్నది.

నాకు చిత్రమనిపించింది. ఖరీదయిన కార్లలో వచ్చి పది రూపాయల దగ్గర గీచి గీచి బ్యారమాడి కుదురక పోయినోళ్లను చూసిన గని అడిగినంత ఒప్పుకునే ఈమెనే చూస్తున్న. 'కుట్టిన తర్వాతగాని బ్యారమాడుతదా ఏంది,' అనిపించింది. కొందరు గట్లనే చేస్తరు. కుట్టేదాక కుట్టమంటరు. కుట్టినంక సతాయిస్తరు. ఆమెను చూస్తే అట్ల అనిపించలేదు. ఎల్లి బతికిన మనిషి లెక్కనే వుంది. అయినా, ఎందుకైనా మంచిదని ముందుగనే అన్న.

ఆమె నవ్వుతూ, "చెప్పిన గదా. నాది మాటంటె మాటే అని. కుట్టిచ్చుకోవాలంటే కుట్టిచ్చుకొవాలె గంతే. కాని, మంచిగ కుట్టాలే... మా అక్క నా బట్టలుజూసి కుళ్లు కోవాలే. చెప్పితె నమ్ముతలేదు. నీ బతుక్కు పోత బట్టలా... అని ఎక్కిరిత్తంది," అన్నది.

అడుగుతె చెప్పునేమోగని ఎందుకచ్చిన సోది అని, 'అక్క ఎవలు ఏమిటని,' నేను అడుగలేదు. ఆరు వందలు తీసుకుని చిట్టి చింపిచ్చిన. అదే రోజు చీరెను ఎంబ్రాయిడరీకి జాకెట్‌ను మగ్గం వర్క్‌కు ఇచ్చిన.

సద్దుల బతుకమ్మ ఇంకా ఎనిమిది రోజులుంది. నేను పనోళ్లను ఆగపెట్టి నాలుగు రోజులకే ఇయ్యిమన్న. అన్నట్టే తెచ్చి ఇచ్చిండ్రు. ఆనాడే జాకిట్ కుట్టి ఎప్పుడచ్చినా ఇద్దామని రడీగ కవర్ల పెట్టిన.

మా అవ్వకు పాణం బాగలేక నిన్న టేలర్ తెరువలేదు. దవాఖానకు పోయిన. ఈరోజు టేలర్ తెరువంగనే ఆమె బట్టల కవరు కనిపించింది. 'ఈ రోజు ఏడోరోజు, రేపు వచ్చి తీసుకపోతది గావాచ్చు,' అనుకున్న.

అప్పుడే మా చెల్లె ఫోన్ జేసింది. తియ్యద్దు అనుకున్నగని తీసిన.

"అన్నా... అవ్వకెట్లుందే. నిన్న దవాఖాన్లకు పోయిండ్రట," అడిగింది.

నాకు కోపమచ్చింది. "ఎట్లుందని అడుగుతున్నవు. ఓసారి వచ్చి చూసిపోతె తప్పా. సచ్చినంక అవ్వా అని ఏడుసుకుంటత్తవా. అదేమో, 'బిడ్డో బిడ్డో...' అని కలువరిత్తంది," ఎక్కిరిత్తూ అన్న.

"ఏం జెయ్యాలన్నా... నిన్నటి వానకు పత్తి మొత్తం నానిపోయింది. ఈసారన్నా కొంత అప్పు తీరుతదనుకున్న. వాన పాడుగాను... ఎటు గాకుంట జేసె. బతుకు వడ్లుపెరుగు గలిపినట్లుందన్నా. బాధ బాధగుంది..." ఇంకా ఏదో బాధ చెప్పబోయింది.

ఎప్పుడు ఇంతె... ఫోన్ జెయ్యపాపము చాట భారతం చెప్పుతది. ఒడువది దంగది.

నేను విసుగ్గా నడుమలనే ఆపి, "ఆ... నీకు బాధ లేనిదెన్నడు చెప్పు. ఓసారి వడ్లు నానినయంటవు. ఓసారి వరి ఎండిందంటవు. ఓసారి మోటర్ కాలిందంటవు. ఇంకోసారి పాణం బాగ లేదంటవు," అన్న.

ఏమనుకుందో ఏడుపు గొంతుతో, "ఇయల్ల సద్దుల బతుకమ్మ పండుగు గదన్నా. రేపస్త," అన్నది.

"రేపేరా. నువ్వు యాడాదికేరా. ఇక్కడేం పడిపోతలేదు," ఆంటూ ఫోన్ కట్ జేసిన.

అగో... ఇప్పుడు నేను విసుగ్గా సెల్‌ఫోన్ పక్కన పెడుతుంటే ఆమె యాదికచ్చింది.

'అరే... ఎంత పనాయె పాపం... ఎముడాల ఊర్లె పండుగ ఇయ్యాల్లనే,' అనుకుంట టైము చూసుకున్న. పన్నెండు దాటింది.

అన్ని ఊర్లల్ల సద్దుల బతుకమ్మ తొమ్మిది రోజులల్ల అయితే ఎముడాలల మాత్రం ఏడురోజుల్లనే చేస్తరు. ఎప్పుడో ఎనుకట ఓ రాజు తన బిడ్డను ఎముడాల

కిచ్చిండట. బతుకమ్మ పండుక్కు బిడ్డను రమ్మన్నడట. 'నా వూర్లెనే పండుగాయె నేనెట్ల రావాలె నాయినా,' అన్నదట. బతుకమ్మ ఆడిబిడ్డల పండుగాయె. బిడ్డ రాకుంటె పండుగనే లేదనుకున్న రాజు ఎముడాలల ఏడొద్దుల్లనే సద్దులు చెయ్యాలని ఆడరేసిండట. వూర్లె పండుగు చేసుకుని ఎనిమిదోరోజు తల్లిగారింటికి చేరవోయిందట రాజు బిడ్డ. అప్పటినుంచి అదే ఆచారమైంది.

నాకు మనుసు గిలకొట్టినట్టయింది. 'పాపం. ఇష్టంకొద్ది కుట్టిచ్చుకుంది. నిన్న ఎన్నిసార్లు తిరిగిపోయిందో... సద్దుల బతుకమ్మకు అంటే నేను తొమ్మిది రోజులను కుంటి?' అనుకున్న. డబ్బులు మొత్తం ముడితే ఆమెనే వత్తదిలే అనుకుందుంటి. ఇప్పుడు రెండు వేల నాలుగు వందలియ్యాలె. పండుగ ఎల్లిపోతె బట్టల కోసం రారు. వచ్చినా ఇచ్చేకాడ కిరికిరి వెడుతరు. నాదే తప్పంటరు. అట్ల కొండబోక ఇడిసి పెట్టినయి నా దగ్గర బాగనే వున్నయి.

'అయ్యా... ఇయ్యాల్ల ఇయ్యకుంటె నేను మునుగుత. లాభం గువ్వలకత్తది. ఎముడాల ఎంత దూరం. అద్దగంటల పొయ్యత్త. ఇంటికచ్చి ఇచ్చి పోయిండన్న పేరుంటది. నా డబ్బులు నాకత్తయి. సుట్టాలకో పక్కాల్లకో నా దగ్గరనే కుట్టిచ్చుకొమ్మని చెప్పతది,' అనుకుంట షెట్టర్ దించి కిందికచ్చి బండెక్కిన.

అప్పుడే వీరేశం దగ్గరి నుంచి ఫోన్. బిడ్డ పెండ్లికి బట్టలు కుట్టిచ్చిండు. రేపే పెండ్లి. ఇయ్యాల్లనే పెండ్లిపిల్లను జేత్తరు. నిన్నటి నుంచి ఫోన్ జేత్తండు. మల్ల మీదికెక్కాలంటె యాష్టనిపించింది.

"అరే. అయిదు నిమిషాల ముందు ఫోన్ జెసినా బాగుండు గదా. కిందికచ్చిన ఒక్క అద్దగంట ఆగి రా." ఫోన్ కట్ చేసి గేరు మార్చిన. ఊరు జెట్టన్నే దాటినగని చంద్రంపేటకు వచ్చినంక అసలు కథ మొదలయింది.

డబల్ రోడ్డు పోత్తున్నట్టున్నరు. రోడ్డు నిండా కంకర కుప్పలు. రోడ్డును మొత్తం తవ్వింద్రు. వచ్చిపోయే బండ్లు. తొవ్వ సాగుతలేదు. నిన్నటి వానకు గుంటలల్ల నీళ్లు నిండి బురుద బురుదగుంది. పావుగంట అనుకున్న పోకడ అద్దగంట వట్టింది. అప్పటికి నాలుగు సార్లు వీరేశం నుంచి ఫోన్.

తిప్పారం గడ్డ ముందటనే వుంటది జ్యోతి ఇల్లు. జెట్టన్నే దొరికింది. సున్నం వెయ్యని ఇందిరమ్మ ఇల్లు. వాకిలి మొరందేలింది. ఈమెకు పోకడనే ఎక్కువ గని ఇంట్ల ఏం లేనట్టే వుందనుకున్న. నేను వెళ్లేసరికి ఇంటికి తాళం వేస్తుంది. నన్ను చూసి దగ్గరికచ్చింది.

"వచ్చినవా అన్నా... రా. దేవుని లెక్క సరిగ్గ సమయానికచ్చినవు. బట్టలు తెచ్చినట్టున్నవు," అన్నది చేతులు చాపుతూ.

మనిషి మొన్నటి లెక్క లేదు. మొఖం పీక్కపోయింది. జట్టు రేగిపోయింది. ఆగమాగముంది. నేను చిత్రంగా, 'అరే... గిట్లున్నదేంది,' అనుకుంట బట్టల కవరును అందించిన.

కవరు అందుకుంట, "నేను అటే వత్తన్న. నన్ను చంద్రంపేట కాడ దించన్న," అన్నది. నేను, 'డబ్బులు,' అన్నట్టు చూసిన. "అక్కడనే ఇస్త పా," అంటూ బండెక్కింది.

నేను ఆశ్చర్యంగా, "అటెందుకు. ఇయ్యాల్ల పండుగు గదా..." అన్న.

"పండుగేగని ఏం జేద్దాం. ఈ బట్టలు మా అక్క బొందకు వెట్టి రావాలె. దొంగ మొఖంది," అన్నది బాధగా,

"అగో... నువ్వు గంత ఇష్టపడి కుట్టిచ్చికున్నవు గదమ్మా. ఆమెకెందుకిచ్చుడు," గేరు మారుస్తూ అడిగిన.

"ఖర్మన్నా... ఖర్మ. లోకంల అందరి సాళ్లు వేరు. నా సాలు వేరు. నేను కుట్టిచ్చు కున్నట్టు ఎరుకయింది గదా. సుప్పనాతి ముండకు. నా బట్టలే కావాలని అలిగి పన్నది," బాధగా చెప్పింది.

ఆమె బాధకు కారణం అప్పుడర్థమయింది. గోసనిపించింది.

"అ... మీ కథ మంచిగనే వుంది. ఆమె అలుగుడు సరే నువ్వు ఇచ్చుడు సరే. దునియల మీరే వున్నరా ఏంది అక్కజెల్లెండ్లు. ఇంతకు అమె ఏం పనిజేత్తది," అడిగిన.

"దాని చేసుట్ల మన్నువడ. ఏం జేత్తది. ఎవుసమే. అప్పుడప్పుడు మార్కెట్‌ల నామీద పోటికి కూరగాయలమ్ముతది. ఓసారి గిట్లనే వడ్లమ్మితె ఆరువెయిలచ్చినయని చెప్పిన గంతే... ఇచ్చెదాక పట్టువట్టింది," ఏడుస్తూ చెప్పింది.

నాకు బాధనిపించింది. "అ... ఇచ్చెటోళ్లుంటే గట్లనే అడుగుతరు. అడిగినట్టిత్తె కడిగినట్టయితవు. అక్క లేదు, చెల్లెలేదు. నీ సంసారం నీది. ఇయ్యనని చెప్పాలె," అన్న.

"ఇంతకుముందు ఇట్ల లేకుండెనన్నా. రాజా గుణముండె. మాకు అయ్య లేడు, అవ్వలేదు. ఇద్దరమే. దానికి నేను, నాకది. నన్ను సాది సవరిచ్చి పెండ్లి జేసింది. నేనంటె పాణమిత్తుండె. దొంగమొఖంది ఇప్పుడు అప్పుల పాలయింది గని ఒకప్పుడు రెండు నాగండ్ల ఎవుసం," చెప్పింది.

కంకరరాళ్లను తప్పిచ్చుకుంట బండి నడుపుతూ, "రెండు నాగండ్లా... భూమి బాగానే వున్నట్టుంది. మరి ఇదేం రోగం. మంది సొమ్ములకు ఆశపడుడు," అడిగిన.

బండి కుదుపులకు సర్దుకుని కూసుంటూ, "దాని వుండుట్ల మన్నువడ. ఇప్పుడే ముంది ఉత్త చిప్పనే గని. మొదట్లగూడ ఏం లేకుండె. మా బావ పటేలు దగ్గిర జీత ముంటుండె. అప్పు సప్పు జేసి వాళ్లదే నాలుగెకురాలు కొన్నరు. పంట మంచిగనే పండింది. నాలుగయిదేండ్లల్లనే అప్పులు పోంగ చేతుల పైసలు మిగిలినయి..." చెప్పుతనే వుంది.

నా సెల్ మోగింది. చూస్తే వీరేశమే. భయమైంది. ఫోన్ ఎత్తలేదు.

'పాపం... ఎంత పరేషానయితండో. బట్టలు ఇచ్చన్న రాకపోతి. తొవ్వ ఇట్లుందని తెలిస్తే రాకనే పోతుంటి,' అనుకుంట స్పీడ్ పెంచిన. ఎంత పెంచినా ముల్లు ముప్పయి దాటుత లేదు. ఆమె మాత్రం ఆగకుంట చెప్పుక పోతనే వుంది.

''చేతుల నాలుగు పైసలు కనవడంగనే బొడ్డి యాడాగలేదన్నా. అప్పు జేసి ఇల్లు గట్టింది. కిస్మత్ ఎప్పటికి సాతిత్తదా. కరువు వడ్డది. ఏండ్ల నుంచి పారిచ్చిన బాయి ఎండుకపోయింది.''

ఎదురుగా బోరుబండి వచ్చింది. ఆమె మాటలు ఆపింది. ముందుకు పోదామంటె తొవ్వలేదు. నేను విసుగ్గా బండిని పక్కకు తీసి ఆపిన. బోరుబండి వెళ్లిపోయింది.

ఆమె బోరుబండి దిక్కు చూపిస్తూ పిడుగు వడ్డట్టే, ''ఇగో... ఈ బోరుబండ్లు అప్పుడప్పుడే కొత్తగచ్చినయి. తెగారం జేసి మూడు బోర్లేసింది. అదేం పాపమోగని సుక్కనీళ్లు వడలేదు. నాలుగో బోరు మాత్రం పాతాలగంగనే. మల్ల పంట మర్రింది. నాలుగు ఎకురాలు పారింది. యాసంగి, వానకాలం రెండు పంటలు పండినయి. రెండు మూడేండ్లల్ల మల్ల ఎప్పటి లెక్క కుదురుకున్నరు.'' పొడి పొడి మాటలు కాకుండా బాధలన్ని ఎత్తి పోతున్నట్టు చెప్పుతంది.

నాకు విసుగు పుడుతుంది. ఓ దిక్కు వచ్చిపోయే వాహనాలు. మరో దిక్కు వీరేశం బట్టలు. 'ఎప్పుడు వూరత్తదిరా దేవుడా?' అనుకుంట మాటవరుసకన్నట్టు, ''పంట పండాలె గని ఎవసంను మించిన రాజా పనున్నాది. మంట్లో మానెడు. ఇంట్ల పుట్టెడు...'' అన్న.

''నిజమన్నా... ఒక్క పంటగాదు. బోరు దగ్గర తీరొక్క పంట తీసింది. లచ్చిమి తారంగమాడింది. దొంగమొకపుది అప్పుడే నాలుగు తులాల బంగారం కొన్నది. తర్వాత ఏమయిందో ఎరికేనా అన్నా,'' అడిగింది.

బస్సులు లైను కట్టినయి. వాటిని చూడంగనే నాకు సల్ల చెమటలు పుట్టినయి. ''ఆ... ఇయ్యల్ల పోయినట్టె... ఈ రోడ్డు పాడుగాను... పొయ్యకుంటేమవు. నాగండానసే పోత్తున్నట్టున్నరు,'' అన్న.

వెంటనే అందుకుందామె. ''అయ్యో అన్నా. అప్పుడు గిట్లనే అన్నరందరు. ఈ రోడ్డు నా చిన్నతనంల పోసింద్రు. అంతకుముందు కంకరరోడ్డేనాయె. రోడ్డు పడంగనే ట్రాక్టర్లచ్చినయి. ఇంట్ల దాసుకున్న ఇత్తనాలు మొలువకుంటయినయి. ఆకు పెండ పనిజెయ్యకుంటయినయి. వరికి లేని లేని రోగాలచ్చినయి. చేతుల నిండ పైసలుంటెనే ఎవుసం నడిచింది. మా అక్క కత ఏమయింది ఎరికేనా అన్నా,'' మల్లడిగింది.

కండ్లల్ల దుమ్ము, కంకరరాళ్లు, అటు ఇటు బండ్లు... మోగుతున్న ఫోన్... నా బాధల నేనున్న. ఒకటి రెండు ముచ్చట్లు చెప్పి ఊకుంటదనుకున్న. కొత్త, పాత లేకుంట అట్లనే వాగుతూ రెట్టించి అడుగుతుంటె కోపమచ్చింది. కారడ్డంగా, ''ఏం. మీ ఆక్క కొంప మునిగిందా...'' అన్న.

నోరు మూస్తుందనుకున్న. ఏం మనిషో ఏమో... నేనేదో ఆత్రుతగా అడిగినట్టు, ''ఆ... నిజంగనే మునిగిందన్నా. మొదటిసారి సేటు దగ్గర ఖాత వెట్టింది. ఎరువులు

ఇత్తనాలు పురుగుమందులు అడ్డగోలు కొనుడు వెట్టింది. పండిన పంట వానికే పోసింది. బాకి పెరిగింది, వాడు పెరిగిండు. ఇది మాత్రం అడుగువట్టింది,'' చెప్పుతనే వుంది.

నాకు విసుగు పుట్టింది. ఇంతవరకు మర్యాదకు ఊకున్నగని ఇప్పుడు ఓపిక లేదు. పెంచి పెద్దజేసిన అక్క మీదనే ఇంత వడె పోసుకుంటుందంటె ఈమె ఓర్పుమల్లె మనిషే అనుకున్న.

``ఎక్కడి గోసకచ్చెరా దేవుడా, గాలికి బోయె కంప మెడకు వెట్టుకున్నట్టాయే. ఇంటికి జేరెదాక ఇట్లనే పల్లికాయ ఒలిచినట్టు ఒర్రుతవా ఏంది...?'' వినిపించాలనే గట్టిగా అన్న.

అయినా, ఆమె వినిపించుకోలేదు. పూస గుచ్చినట్టు చెప్పుతనే వుంది. ``ఇప్పుడు ఇంటికి పోయినంక నీకు చూపిస్త. ఆమె కుట్టించుకున్న బట్టలు అడుగుడు పద్ధతేనా అని గట్టిగ అడుగన్న. నాకు ఎవ్వలు లేరనే గదా దాని ధీమా. నువ్వు చెప్పితె నమ్మవుగని ఎన్నడు ఒకలకు చెయ్యి సాపక పోతుండె. వరుసగ కరువులచ్చినయి గదా, ఏమయిందో ఏమోగని గప్పుడే కరంటు కోత మొదలైంది. వాడేం పాపపు దేవుడోగని పట్టు వట్టినట్టు వరి పొట్ట మీదున్నప్పుడు ఎండ కొడుతుండె, కోతల మీదున్నప్పుడు రాళ్లవాన వడుతుండె. బోరన్న ఎండుతుండె. మోటరన్న కాలుతుండె, అటోఇటో నాలుగు గింజలు పండిత్తె కొనేటోడు లేకపోతుండె, అగో... గప్పుడే బావ బాగలేడు. వశంగాక కొన్న బంగారాన్ని అమ్మేసింది గని చెయ్యి సాపి ఎవలను అడుగలేదన్నా.''

నేను మాటలు వింటలేను. ఎదురుగా వత్తున్న పత్తిలారీనే సూత్తున్న. పక్కకు తీద్దామంటె సందు లేదు. కంకరరాశి మీద కాలువెట్టి ఆగిన. దుమ్ము లేపుకుంట లారి దాటిపోయింది.

బండి కదులుతుంటే మళ్లీ అందుకుంది. ``ఈ పత్తె అన్నా. దాని కొంప ముంచింది. నీళ్లు లేక వరి బందు వెట్టింది. వట్టిగ ఊకోక పత్తి వెట్టింది. పత్తి పాడు గాను. కిందికే గని మీదికి రాలే. పండినప్పుడు ధర లేదు. ధరున్నప్పుడు పంట లేదు. అడ్డగోలు లాగోడి. ఉన్న భూమి అమ్మింది. అమ్మిన భూమే కవులుకు తీసుకుంది. సొంత భూమిలనే పరాయిదయింది. ఆగో... అప్పటి నుంచె అది ముందటి అక్కగా లేదు.''

నాకు కోపం ఆగలేదు. ``నువ్వు వదురుడు ఆపకపోతే నేను గూడ ముందటి మనిషిని గాను?'' అన్న గట్టిగా.

నా మాట వినిపించుకుంటేగదా, ఆపకుంట వాగుతనే వుంది.

``...దాని నోరుకు భయపడి దొంగమొఖపుదాన్ని ఎవ్వలు అడుగుత లేరన్నా... జర నువ్వన్న గట్టిగ అడుగాలె... కూటికి గతి లేదుగని లావు రేషం. మాటంటె వడది. పోయినేడు పెద్ద బిడ్డకు కానుపయింది. ఏదో నలుగురిని పిలుసుకుని ఇంట్ల మందం చేసుకుంటె అయిపోతుండె గదా. ఊహూ... వూరందరినీ పిలిచి పెద్దగ ఫంక్షన్ హాల్ల

పురుడు జేసింది. నిరుడు చిన్న బిడ్డ పెద్దమనిషైతే చిన్నగ జేత్తె నలుగురు నవ్వుతరని కొండంత పండుగు చేసింది. మరిప్పుడు నన్ను ఇట్ల చేసిందని ఎరుకైతే నలుగురు నవ్వరా.'' ముందట వాళ్ల అక్క వున్నట్టే లడాయి పెట్టుకున్నట్టే చెప్పుతుంది.

నాకు ఓపిక చచ్చిపోయింది. ఊకుంటె లాభం లేదనుకున్న. ఎంటనే బండి ఆపి ఎనుకకు తిరిగి ఇరుగ జూసిన. ఆమె భయంగా నా దిక్కు చూసింది.

అరిచినట్టు, ''ముందు నువ్వు బండి దిగు. కంపలెక్క ఒక్కటే తరీక తలిగినవు,'' అన్న.

ఒక్కసారి గజ్జుమంది. ఏడుపుకేం తక్కువలేదు. టపటప కండ్లపొంట నీళ్లు కారినయి. బండి దిగకనే తుడుచుకుంట, ''సరెన్నా... తప్పయింది. మాట్లాడ, పోదాం పా...'' అన్నది దీనంగా బతిలాడుతూ.

అది మొదలు చంద్రంపేట వచ్చేదాక నోరు తెరువలేదు. నాకు మనుసు నిమ్మలమయింది. 'ఊ... వాన గొట్టి ఎలిసినట్టాయె, ఈ పని ముందే చెయ్యకపోతిని. డబ్బులియ్యక ఆటాడిత్తంది. నాయి నాకు వారేత్తె ఎక్కడనో దించిపారెసి పోదుంటిని,' అనుకుంట చంద్రంపేట అనుమండ్ల గుడి ముందు బండి ఆపిన.

ఆమె దిగింది. ముందుకు నడువబోతుంటె, ''ఏమాయె.పైసలియ్యవా... పోతున్నవు,'' ఎటకారంగా అన్న.

అక్కడి నుంచి ఏడుత్తనే వున్నట్టంది. నీళ్లు దారలు గట్టినయి. కండ్లు తుడుచుకుని నా దిక్కు గోసోలె చూసి, ''ఇంటిదాక రాన్నా... ఆ దొంగ మొఖం దాన్నె అడిగిత్త. ఈ గుడెనుకనే ఇల్లు,'' అన్నది.

నాకు అనుమానమచ్చింది. 'ఇద్దరి పొత్తుల ఎగవెడుతరా ఏంది?' అనుకున్న. రేపు మాపంటె ఊకుండేది లేదనుకున్న. ఎందుకైనా మంచిదని ఆమె చేతుల నుంచి బట్టల కవరు గుంజుకొని బండిల వెట్టుకున్న. అది ఊహించనట్టుంది. నా దిక్కు దెబ్బతిన్నట్టు చూసింది.

మెత్తగ మాట్లాడితె ఏదో కత చెప్పుతదని కోపంగా, ''ఊ... రేషానికేం తక్కువ లేదు. సాయం జెయ్యవోతె సాలయినంత పాపం జట్టుకుందంటె గిదె. అక్కడికి వోయినంక అక్కజెల్లెండ్రిద్దరు నువ్వంటె నువ్వని గానుగులోల్ల శాత్రం జేత్తె నేనూకోను. ఇసొంటోల్లను శానమందిని జూసిన ఎక్కు,'' అన్న కోపంగా.

బండి కదులుతుంటే వీరేశం నుంచి మల్లా ఫోన్. చూసుకుంటే పన్నెండు మిస్డ్ కాల్స్. వణుకు పుట్టింది. 'ఆ లగ్గం గాదు. ఇయ్యాల్ల నాలగ్గమయితది. తెల్లారి లేచి ఎవని మొఖం జూసిన్నో...' అనుకుంట బండి మలిపిన.

సందిల నుంచి సక్కగ వోతె ఎదురుంగనే ఇల్లు. బండాపి దిగిన. ఇంటి ముందట టెంటుంది.

మమ్ములను చూడంగనే ఎవలో, ''ఆ... ఇంకేంది. తల్లిగారోళ్లచ్చిండ్రు. కొత్త బట్టలు గూడ తెచ్చిండ్రు. జెట్ట జెట్టన కానియ్యిండ్రి...'' అన్నరు.

లోపలి నుంచి సన్నగా ఏడుపులు. నాకు నోట్లె తడారిపోయింది. తల దిమ్మెక్కింది. ఏం జరిగిందో  అర్థంగాలేదు. పిచ్చి లేసినట్టు చుట్టూ జూసిన.

"ఎవుసంల మన్నువడ. ఆర్నెల్లు జేత్తె ముల్లుగట్టె మిగులకపాయె. బిడ్డ అరిగోస ఎల్లదీసె. వానల మన్నువాడ. నిన్న వాన గొట్టకపోతె ఇంత బెంగటిల్లకపోవు. పత్తివెట్టి, పత్తివెట్టి పత్తి మందే తాగి సచ్చె. మనగతి ఎంతకుందో..." ఎవలో పెద్ద మనిషి అలతేరుతుండు.

"నిన్నటి వానొక్కటేనా బాపూ... ఇరవయేండ్ల నుంచి ఎన్ని దెబ్బలు. ఒక్కటా రెండా. మనిషి ఎంతగనమని తట్టుకుంటడు, గిట్లనే నోరుదెరుత్తడు." ఇంకెవలో బాధగా అన్నరు.

"ఆ... యాకాషి మరుణమని ఈత కొయ్యల్ల వడుతమా... మనుండి సాదించాలె. ఎప్పటికి ఇట్లనే వుంటదా. చీకటి కొన్నొద్దులు ఎలుతురు కొన్నొద్దులు. తండ్లాడాలె." ఇంకెవలో.


"నా మీద మన్నువాడ, నిన్న పగటీల్లి ఆగమాగాన మా ఇంటికచ్చింది బిడ్డ. నేనే పని మీదవడి మందలియ్యలే. బాధ చెప్పుకుంటెనన్న బరువు దిగి బతుకుగావచ్చు." ఏడ్చుకుంట ఓ ముసలమ్మ.

జ్యోతి నా ముందుకచ్చింది. ఏడవడానిక్కూడా నీళ్లు లేనట్టు కండ్లు సీసపు గోటీల లెక్క వున్నయి. పులుకు పులుకున మొఖం జూసింది.

"అన్నా... చెప్పుకునే దిక్కు లేక నిన్నటి నుంచి కుమిలిపోతున్న. తోడవుట్టిన తోడు లెక్క యాల్లకచ్చినవు. అది తప్ప నాకు ఈ లోకంల ఎవ్వలు లేరన్నా. దొంగ మొఖంది నన్ను ఒంటిదాన్ని చేసి పోతదా. అడుగన్నా దాన్నడుగు," చిన్న ఓదార్పు కోసం చూస్తూ పక్కున పలిగింది జ్యోతి.

ఎందుకో మా చెల్లె యాదికచ్చింది. నాకు కాళ్లకింది భూమి కదులుతుంది.

*నమస్తే తెలంగాణ*
*24 జనవరి 2016*




పెద్దింటి అశోక్‌కుమార్ 19 ఏప్రిల్ 1966న పుట్టారు. వీరి మొదటి కథ **ఆశ-నిరాశ-ఆశ** 1999లో ఆంధ్రప్రభలో అచ్చయింది. 160 కథలు, ఆరు నవలలు రాశారు. ఐదు కథాసంపుటాలు ప్రచురించారు. నాలుగు నాటకాలు, నాటికలు, వందకు పైగా వ్యాసాలు రాశారు. వీరి జిగిరి నవల 8 భారతీయ భాషల్లోకి అనువాదమయ్యింది. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో కథలు, వ్యాసాలతో పాటు 'లాంగ్ మార్చ్' నవలను రాశారు. మూడుసార్లు తెలుగు యూనివర్శిటీ అవార్డుతో పాటు ఎన్నో అవార్డులు పొందారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు.

*చిరునామా: 4-4-90/1, రెడ్డివాడ, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా - 505 301*
*ఫోన్: 94416 72428* ***akpeddinti@gmail.com***